క్లుప్తంగా

సీఎం జగన్ నాయకత్వంలో సంక్షేమ పాలన

నెహ్రూనగర్: సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమ పాలన అమలవుతోందని 56వ డివిజన్ కార్పొరేటర్ కనకదుర్గ, వైఎస్సార్ సీపీ తూర్పు మహిళా విభాగం నాయకురాలు షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని వెంకటాద్రి పేటలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ నేతలు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా? అని లబ్ధిదారులు అడిగి తెలుసుకున్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



నెహ్రూనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని డెప్యూటీ మేయర్ షేక్ సజీల అధికారులకు సూచించారు. ఆమె సోమవారం తూర్పు నియోజకవర్గం 7వ డివిజన్ పరిధిలో ఆర్ఎస్ బ్రదర్స్ షాపింగ్ మాల్ నుంచి మాయాబజార్ చర్చి వరకు రూ. 35 లక్షలతో జరుగుతున్న కల్వర్టు పనుల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు షేక్ షౌకత్, డీఈ శ్రీనివాసరెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

గుంటూరు ఈస్ట్: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వెంగళాయపాలేనికి చెందిన పోకల లక్ష్మయ్య రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఆటోలో తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు శ్రీరామ్‌నగర్ రోడ్డు వద్ద ఆటో ఆపి వాహనాన్ని తనిఖీ చేయగా, 90 కేజీల బియ్యం దొరికింది. ఆటోను స్వాధీనం చేసుకుని, లక్ష్మయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ



పట్నంబజారు: గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ సోమవారం కొత్తపేట పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ పరిసర ప్రాంతాల్ని పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల్ని త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు. కొత్తపేట పీఎస్ ఎస్‌హెచ్ఓ శీలం శ్రీనివాసరెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్పీతోపాటు ఈస్ట్ డీఎస్పీ సీతారామయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి కుర్చీల బహూకరణ

భట్టిప్రోలు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వాసవీ క్లబ్ జిల్లా ఇన్‌చార్జ్, విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు (బీఎస్సాఆర్) సోమవారం ఆరు కుర్చీలను అందజేశారు. కుర్చీలను అందించేందుకు ముందుకు వచ్చిన శ్రీనివాసరావు సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, వాసవిక్లబ్, సత్యసాయి బాబా ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

1998 డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్లకు న్యాయం చేయాలి

మంగళగిరి: 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్లకు న్యాయం చేయాలని ఏపీ డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. నగరంలోని ఐబీఎస్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత జూన్ నెల 17వ తేదీన సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకున్న 6,852 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రకటించిన ప్రభుత్వం 4,072 మందికి మాత్రమే కౌన్సెలింగ్ నిర్వహించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన వారికీ న్యాయం చేయాలని కోరారు.

ఏడో తరగతి విద్యార్థి అదృశ్యం



మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని ఇస్లాంపేట రెండో లైనుకు చెందిన ఏడవ తరగతి విద్యార్థి అదృశ్యమైన ఘటన సోమవారం జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఇస్లాంపేటకు చెందిన అహ్మద్ అలీ బ్యాంకు కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన విద్యార్థి సాయంత్రం అయినా తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టు పక్కల విచారణ చేశారు. బాలుని ఆచూకీ లభించలేదు. దీంతో కుమారుడు కనిపించడం లేదంటూ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోర్డింగ్స్‌కు క్యూఆర్ కోడ్ విధానం

తొలి విడతగా బ్రాడీపేటలో ఏర్పాటు



హోర్డింగ్స్‌కు క్యూఆర్ కోడ్ అమరుస్తున్న పట్టణ ప్రణాళిక అధికారులు

నెహ్రూనగర్: నగరంలోని హోర్డింగ్స్ విధానం పూర్తి పారదర్శకంగా ఉండేలా, ప్రతి ప్రకటన బోర్డ్ నగరపాలక సంస్థకు ఫీజులు చెల్లించేలా సమగ్ర క్యూఆర్ కోడ్ విధానాన్ని సోమవారం పట్టణ ప్రణాళిక అధికారులు తొలి విడతగా బ్రాడీపేటలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ తొలి విడతగా బకాయిలు చెల్లించిన వారి బోర్డులకు కోడ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇక నుంచి కోడ్ లేని బోర్డుల్ని తొలగించడానికి పట్టణ ప్రణాళిక అధికారులు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారని చెప్పారు. బోర్డులకు ఏర్పాటు చేసే కోడ్‌లను మరొక చోట ఏర్పాటు చేయడానికి వీల్లేకుండా లాంగిట్యూడ్, లాటిట్యూడ్‌లో లోకేషన్ కేటాయింపు ఉంటుదని పేర్కొన్నారు. నగరంలో అన్ని యాడ్ ఏజన్సీలు, వ్యక్తిగత బోర్డులు కల్గిన వారు తప్పనిసరిగా బకాయిలు చెల్లించి క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసుకోవాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీప్లానర్లు మూర్తి, కోటయ్య, ఏసీపీ బాబూరావు, టీపీఎస్‌లు సువర్ణ కుమార్, హృదయరాజు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

డాక్టర్ నరేష్‌బాబుకు అంతర్జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ నరేష్‌బాబు

గుంటూరు మెడికల్: నగరానికి చెందిన సీనియర్ స్పైన్ సర్జన్, మల్లికా స్పైన్ సెంటర్ అధినేత డాక్టర్ జె.నరేష్‌బాబుకు అంతర్జాతీయ అవార్డు లభించింది. ఇంటర్నేషనల్ వెయిట్ బేరింగ్ సొసైటీ నాలుగో అంతర్జాతీయ సదస్సు ఢిల్లీలో ఇటీవల నిర్వహించారు. ఇందులో స్టాండింగ్ ఎమ్మారైలో డాక్టర్ నరేష్‌బాబు చేసిన మూడు పరిశోధనలకు వెయిట్ బేరింగ్ సొసైటీ అవార్డును అందజేసింది. ఈ విషయాన్ని సోమవారం గుంటూరు కొత్తపేటలోని మల్లికా స్పైన్ సెంటర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో డాక్టర్ నరేష్‌బాబు వివరాలు వెల్లడించారు. కీ హోల్ సర్జరీ విధానంలో అతి చిన్న గాటుతో స్పైనల్ ఫిక్సేషన్ చేసే సమయంలో ఎవరికి ఆపరేషన్ విజయవంతంగా చేయవచ్చనే విషయాన్ని నిల్చొని తీసే ఎమ్మారై ద్వారా తాను సమర్పించిన పరిశోధనకు అవార్డును అందజేశారని వివరించారు. నిల్చున్నప్పుడు, పడుకున్నప్పుడు వెన్నుపూసకు రక్త సరఫరా, కూర్చొని మెడ వంచి ఎమ్మారై తీయడం ద్వారా ఎలాంటి సమస్యలు నివారించవచ్చనే విషయాలపై తాను పరిశోధన పత్రాలు సమర్పించినట్లు వెల్లడించారు. స్పెయిన్ దేశానికి చెందిన రేడియాలజిస్ట్ ప్రొఫెసర్ కాయ్ విలనోవా చేతుల మీదుగా అంతర్జాతీయ అవార్డును అందుకున్నట్లు డాక్టర్ నరేష్‌బాబు తెలిపారు. అంతర్జాతీయ అవార్డు అందుకున్న డాక్టర్ నరేష్‌బాబుకు గుంటూరుకు చెందిన సీనియర్ సర్జన్, ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వి.వి.నారాయణరావు, సీనియర్ సర్జన్ డాక్టర్ సూరత్ అమర్‌నాథ్, గుంటూరు బోన్ క్లబ్‌కు చెందిన పలువురు ఆర్థోపెడిక్ సర్జన్స్ సోమవారం అభినందనలు తెలిపారు.

వైద్య విద్యార్థినికి ఆర్థిక చేయూత



లక్ష్మీ ప్రశాంతికి ఆర్థిక సహాయం చేస్తున్న తిలక్‌బాబు, రవిప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: నిరుపేద కుటుంబానికి చెందిన వైద్య విద్యార్థినికి సొసైటీ ఫర్ రూరల్ స్కాలర్స్ (ఎస్ఎఫ్ఆర్ఎస్) రూ.40వేల ఆర్థిక సహాయాన్ని అందజేసింది. విద్యానగర్‌లోని ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎన్నారై విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బాబు మాట్లాడుతూ గుజ్జనగుండ్లలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మేన్‌గా పని చేస్తున్న సిరికొండ సత్యనారాయణ కుమార్తె లక్ష్మీ ప్రశాంతికి ఏలూరులోని ఆశ్రమ్ మెడికల్ కళాశాలలో ఏ కేటగిరీలో ఎంబీబీఎస్ సీటు వచ్చిందని తెలిపారు. ప్రైవేటు కళాశాల కావడంతో ఫీజులు, ఖర్చుల రూపంలో రూ.85వేల వరకు ఖర్చయ్యే పరిస్థితుల్లో తండ్రి సత్యనారాయణ నిస్సహాతను తెలుసుకున్న ఎస్ఎఫ్ఆర్ఎస్ సంస్థ చైర్మన్ డాక్టర్ ఆలపాటి రవీంద్ర మొదటి విడతగా రూ.40వేలు ఆర్థిక సహాయాన్ని సీఏవో రవిప్రసాద్, తిలక్‌బాబు చేతుల మీదుగా అందజేశారు. రవిప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యాసంవత్సరంలో 22 మంది విద్యార్థులకు రూ.నాలుగు లక్షలు, రెండో విడతలో ఆరుగురు విద్యార్థులకు 2.25 లక్షలు, మూడో విడతలో 11 మందికి రూ.రెండు లక్షలు చొప్పున అందజేసినట్లు వివరించారు. ఎన్నారై ఎడ్యుకేషనల్ సొసైటీలో చదువుతున్న మరో 18 మంది విద్యార్థులకు రూ.మూడు లక్షలు ఆర్థిక సాయం అందజేశామని తెలిపారు. పేదరికం కారణంగా ఉన్నత చదువులు అభ్యసించలేకపోతున్న విద్యార్థులు విద్యానగర్ 4వ లైనులోని సాయిబాబా మందిరం ఎదుట ఉన్న ఎస్ఎఫ్ఆర్ఎస్ సంస్థలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో నాగేంద్రబోస్, లక్ష్మీ ప్రశాంతి తండ్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

రూపేష్ మక్వానాకు ఘన స్వాగతం



రూపేష్ మక్వానాకు అభినందనలు తెలియజేస్తున్న ఏబీవీపీ నేతలు

గుంటూరు ఎడ్యుకేషన్: రన్ ఫర్ సేవ్ యూత్–సేవ్ నేషన్ నినాదంతో 95 రోజుల్లో ఆరువేల కిలోమీటర్ల పరుగు చేపట్టిన గుజరాత్ వాసి రూపేష్ మక్వానా సోమవారం గుంటూరు నగరానికి వచ్చారు. మిర్చి యార్డు రోడ్డులోని ఓ హోటల్లో సోమవారం సాయంత్రం రూపేష్ మక్వానాను కలిసిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) గుంటూరు నగర శాఖ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డి. సాయిచరణ్ గుప్తా మాట్లాడుతూ ఢిల్లీ నుంచి ప్రారంభించిన పరుగు తిరిగి ఢిల్లీకి చేరుకునే లక్ష్యంతో రోజుకు 70 కిలోమీటర్లకు పైగా రూపేష్ మక్వానా పయనిస్తూ మార్గంమధ్యంలో గుంటూరుకు వచ్చారని చెప్పారు. ఆగిన చోటల్లా గ్రామాలు, నగరాల్లోని కళాశాలల్లో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా యువతరాన్ని చైతన్య పర్చేందుకు ప్రయత్నిస్తూ, తలచుకుంటే ఏదైనా సాధించగలరనే నమ్మకాన్ని వారిలో కలిగించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. యువతను ఉత్తేజపరచి, వారిలోని నైపుణ్యాల్ని వెలికితీయాలనే ఉద్దేశంతో తన విలువైన సమయాన్ని కేటాయించడం అభినందనీయమన్నారు. యువతరం రూపేష్ మక్వానా వంటి వ్యక్తుల్ని ఆదర్శంగా తీసుకుని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ దివాకర్, నగర కార్యదర్శి శ్రీకాంత్, ఉదయ్, కార్తీక్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల నాణ్యత పరిశీలన



తాడేపల్లి 2వ వార్డులో అభివృద్ధి పనుల నాణ్యతను పరిశీలిస్తున్న క్వాలిటీ బోర్డు సిబ్బంది

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 130 కోట్ల రూపాయలు కేటాయించడంతో పలుచోట్ల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎప్పటికప్పుడు కార్పొరేషన్ అధికారులు పనుల నాణ్యతపై క్వాలిటీ కంట్రోల్ అధికారులతో తనిఖీలు చేయిస్తున్నారు. సోమవారం 2వ వార్డులో సుమారు రూ.40 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణ పనుల నాణ్యతను క్వాలిటీబోర్డు అధికారులు పరిశీలించారు. డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ క్వాలిటీ కంట్రోల్ అధికారుల దగ్గర నుంచి నివేదిక వచ్చిన తరువాత మాత్రమే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నామని స్పష్టం చేశారు.

ఇప్పటంలో తాగునీటి సరఫరా



ఇప్పటంలో కార్పొరేషన్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

తాడేపల్లి రూరల్ : ఇప్పటంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా కార్పొరేషన్ అధికారులు గతంలో ఉన్న పాత తాగునీటి పైపులైన్లు తొలగించారు. ఆ ప్రాంతంలో తాగునీటికి ఇబ్బంది రాకుండా కార్పొరేషన్ అధికారులు సోమవారం నుంచి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా పాత పైపులైన్లు తొలగించి, వాటిస్థానంలో రోడ్డు మార్జిన్‌లో కొత్త పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు. మరో నాలుగు రోజుల పాటు ఇప్పటంలోని ప్రతి ప్రాంతానికి మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు.

క్లారినెట్ విద్వాంసుడు శ్రీనివాస్‌కు సన్మానం



తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం బంగారు మనిషి చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం కథానాయకుడు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం క్లారినెట్ విద్వాంసుడు కోడూరు శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐతగోని గోపి, తురకారపు లక్ష్మీనారాయణ, కర్నాటి లక్ష్మయ్య, భీమనపల్లి సత్యం, కాటం సాంబయ్య, కాటం రవికుమార్, సోమవరపు సాంబశివరావు, ఈదర శ్రీనివాస రావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, పినపాటి రవీంద్ర, ముళ్లపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



తెనాలి రూరల్: ప్రైవేటు వైద్యశాలలో సిబ్బందిపై దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు వైద్యులు పోలీసుల్ని కోరారు. పట్టణ పాత ప్రభుత్వ వైద్యశాల సమీపంలోని ఓ వైద్యశాలకు అపస్మారకస్థితిలో ఉన్న ఓ పాపను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి తీసుకువచ్చారు. వైద్యం సరిగా చేయడంలేదని డ్యూటీలో ఉన్న డాక్టర్‌తో పాటు సిబ్బందిపై దౌర్జన్యం చేసి దాడి చేశారు. దీనికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ కోటినాగయ్య, వైద్యులు టూ టౌన్ సీఐ ఎస్. వెంకట్రావును సోమవారం కలసి దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేశారు.

'స్పందన'కు ఎనిమిది దరఖాస్తులు

తెనాలి: సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన సమావేశంలో వివిధ ప్రాంతాల్నుంచి వచ్చిన ప్రజలు ఎనిమిది అర్జీల్ని సమర్పించారు. సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ వాటిని స్వీకరించారు. అర్జీదారుల్ని స్వయంగా పలకరించి, వారి సమస్యల్ని తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు పంపి, నిర్ణీత వ్యవధిలో పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు.

చిరువ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత



మంగళగిరి: ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సహకారంతో నగరంలోని చిరు వ్యాపారులకు సోమవారం తోపుడు బండ్లు అందజేశారు. సోమవారం ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. చిరు వ్యాపారులు ఊదర ప్రశాంతి, రావూరి వెంకటేశ్వరమ్మ, నాగ వెంకట శివ, సుభానీలకు పార్టీ నాయకులు ఎమ్మెల్యే ఆర్కే సొంత నిధులతో సమకూర్చిన తోపుడు బండ్లు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు మునగాల మల్లేశ్వర రావు, పార్టీ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు సంకె సునీత, పార్టీ నాయకులు ఎండీ ఫిరోజ్, దొడ్డక కృష్ణ, సుబ్బారావు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కాకుమాను: మండలం కేంద్రం కాకుమానులో వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి చెన్నకేశవ స్వామి దేవస్థానంలో సోమవారం స్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా కన్నుల పండువలా జరిగింది. ఉదయాన్నే స్వామి వారి దంపతులను పట్టు వస్త్రాలతో విశేషంగా అలంకరించి గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవంలో రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి మేకతోటి దయాసాగర్, గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త నల్లమోతు (ఏరీస్) రత్తయ్య దంపతులు పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. స్వామివారి కల్యాణ మహోత్సవం సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో అన్న సంతర్పణ కార్యక్రమంలో నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, తెలగాయపాలెం సర్పంచ్ చింతల రాహేలమ్మ, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డాక్టర్ రోహితకు ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఎక్సెలెన్స్ అవార్డు



గుంటూరు మెడికల్: నగరానికి చెందిన జనరల్ ఫిజీషియన్ డాక్టర్ చిటితోటి రోహితకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఎక్సెలెన్స్ అవార్డు లభించింది. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ ట్రస్టు ఇంటర్నేషనల్ సంస్థ హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డును అందజేసింది. డాక్టర్ రోహిత చిత్తశుద్ధితో చేస్తున్న ఉత్తమ వైద్య సేవలకు అవార్డు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆమె మంగళగిరి ఎన్నారై వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అవార్డు అందుకున్న డాక్టర్ రోహితకు రేడియాలజిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చిటితోటి కిశోర్‌కుమార్, గుంటూరుకు చెందిన పలువురు రేడియాలజిస్టులు, జనరల్ ఫిజీషియన్లు సోమవారం అభినందనలు తెలిపారు.

ప్రజా సమస్యలకు నిర్దేశిత గడువులోగా పరిష్కారం

అధికారులకు కమిషనర్ కీర్తి చేకూరి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ప్రజల నుంచి సమస్యలపై అందే ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం స్పందన నిర్వహించారు. ముందుగా గత వారం ఫిర్యాదుల పరిష్కారం, స్పందన పోర్టల్, ఈఆర్పీ, వాట్సాప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదులపై అధికారులు, సంబంధిత కార్యదర్శులతో సమీక్షించారు. ప్రజల సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ఫిర్యాదుల పరిష్కారంపై బాధ్యతతో వ్యవహరించాలని చెప్పారు. పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని సూచించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 38 ఫిర్యాదులు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 13, ఇంజినీరింగ్ విభాగానికి 10, ప్రజారోగ్య విభాగానికి రెండు, రెవెన్యూ విభాగానికి 10, ఉపా సెల్ విభాగానికి రెండు, అకౌంట్స్ విభాగానికి ఒకటి, పరిపాలన విభాగానికి రెండు చొప్పున ఫిర్యాదులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్. శ్రీనివాస్, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, డెప్యూటీ సిటీ ప్లానర్లు, ఏసీపీలు, ఆర్వోలు, ఈఈలు, ఎస్ఎస్‌లు పాల్గొన్నారు.

ఈద్గాల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



మేయర్ కావటికి వినతి పత్రం అందజేస్తున్న అంజుమన్ కమిటీ సభ్యులు

నెహ్రూనగర్: రంజాన్ పండుగ రోజున ప్రార్థనలు జరుపుకొనే ఈద్గాల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య పనులతో పాటు మౌలిక సదుపాయాల్ని కల్పించాలని కోరుతూ సోమవారం అంజుమన్ కమిటీ సభ్యులు మేయర్ కావటికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత బస్టాండ్ వద్ద ఉన్న ఉర్దూ బాయ్స్ పాఠశాలతో పాటు పొన్నూరు రోడ్డులోని బీఈడీ కళాశాల వద్ద ఈద్గాతో పాటు నగరంపాలెం రోడ్డులోని అంజుమన్ ఇస్లామియా ఈద్గాలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు, జంగల్ క్లియరెన్స్, తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ మహమూద్, ఖాజా మొహిద్దీన్ చిష్టి, అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్ మహమ్మద్ కర్నూమ, సెక్రటరీ సయ్యద్ అబ్దుల్ సలాం, డైరెక్టర్ హిదాయత్, కమిటీ సభ్యులు మస్తాన్ షరీఫ్, షారూఖ్, బాబు, ఖాజా పాల్గొన్నారు.

ఆంగ్ల సాహిత్యానికి వన్నె తెచ్చిన విలియం వర్డ్స్‌వర్త్



హేమమాలిని రాణిని సత్కరిస్తున్న రామకృష్ణమూర్తి, ప్రసాద్, అధ్యాపక బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంగ్ల సాహిత్యానికి విలియం వర్డ్స్‌వర్త్ వన్నె తెచ్చారని విశ్రాంత ఆంగ్ల అధ్యాపకురాలు, ఆధ్యాత్మికవేత్త డాక్టర్ హేమమాలిని రాణి పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాల ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో సోమవారం సుప్రసిద్ధ ఆంగ్ల కవి విలియం వర్డ్స్‌వర్త్ జయంతి సభ నిర్వహించారు. ఆంగ్ల శాఖ అధ్యక్షుడు డాక్టర్ అందె బాలశౌరి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హేమమాలిని వర్డ్స్‌వర్త్ రచనలు, జీవిత విశేషాల్ని వివరించారు. ఆయన ప్రకృతి పరంగా కవిత్వం రాసి రొమాంటిక్ కవిగా ఆంగ్ల సాహిత్యంలో స్థిర స్థానం సాధించాడని చెప్పారు. ఆయన్ను అనుసరించి ఎంతో మంది అద్భుతమైన రొమాంటిక్ కవిత్వం రాశారని తెలిపారు. అనంతరం ఆమెను కళాశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణ మూర్తి, ప్రిన్సిపాల్ పి.ఎం. ప్రసాద్, ఆంగ్ల అధ్యాపకులు చిలకా అరుణ, బ్యూలా రాణి, మేజర్ చుక్కా నవీన్ కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.వి.ఎస్. దుర్గా ప్రసాద్, ఈ. సుదర్శన్, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణ ప్రణాళిక అధికారులపై లోకయుక్తాకు ఫిర్యాదు

మే 3న విచారణకు రావాలని ఆదేశం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులపై లోకాయుక్తాకు ఫిర్యాదు అందింది. దీనిపై మే 3న సంబంధింత వివరాలు అందజేయాలని(విచారణకు రావాలని) సోమవారం నోటీసులు జారీ చేసింది. నగరంలోని శ్యామలదాస్ అగ్రహారం కొత్తపేటకు చెందిన షేక్ షజాదీ తన స్థలంలో వేరే వ్యక్తి అక్రమంగా రేకుల షెడ్డు వేసుకున్నారని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని ఐదుసార్లు నగరపాలక సంస్థ గ్రీవెన్స్‌లో అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదు. మున్సిపల్ సర్వేయర్ రిపోర్టులు తమకు అనుకూలంగా ఉన్నప్పటికీ పట్టణ ప్రణాళిక అధికారులు న్యాయం చేయకపోగా ఏసీపీ షేక్ కాలేషా, డీసీపీలు కోటయ్య, జీవీఎస్ మూర్తి ఆక్రమణదారులకు వత్తాసు పలకుతున్నారని షేక్ షజాదీ ఆరోపించారు. దీనిపై మరలా స్పందనలో ఫిర్యాదు చేయగా కలెక్టర్ ఆదేశాల మేరకు రేకుల షెడ్ తొలగిస్తామని, విడతల వారీగా నోటీసులు అందించి ఆ తరువాత తొలగిస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు దీనిపై గత నెల 2న లోకయుక్తాకు ఫిర్యాదు చేయగా మే 3న విచారణకు సంబంధించి పూర్తి వివరాలను అందజేయాలని నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారుల్ని ఆదేశించింది.

రాష్ట్ర భవిష్యత్తు దిశా నిర్దేశకుడు సీఎం జగన్

ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



లబ్ధి పొందిన పథకాల గురించి ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌కు తెలియజేస్తున్న మహిళ

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర భవిష్యత్తు దిశా నిర్దేశకుడు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. సోమవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 23, 24వ డివిజన్ల పరిధి జీటీ రోడ్డులోని సీసీ ప్రైమ్, ఏటీ అగ్రహారం ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, నేతలు ఇంటింటికీ వెళ్లి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వ పాలనలో చేసిన అభివృద్ధి, జగనన్న చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు తేడాను వివరిస్తూ కరపత్రాల్ని ప్రజలకు అందజేశారు. ప్రజల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గత నాలుగేళ్లుగా అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిపై సంతృప్తి చెందితేనే మరలా మమ్మల్ని ఆశీర్వదించాలని ప్రజల్ని కోరారు. గత ప్రభుత్వంలో ఎన్నడూ ఇంటికి వచ్చి పలకరించిన నాయకుడు ఒక్కరు సైతం లేరని తెలిపారు. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అందించడమే కాక, ఎమ్మెల్యేలు ఇళ్లకు వచ్చి పథకాలు అందుతున్నాయా.. లేదా ? అని అడిగి తెలుసుకోవడం రాష్ట్రంలో ఎక్కడా లేదని పేర్కొన్నారు. ప్రజా పాలనకు సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారని తెలిపారు. రాష్ట్రాన్ని తన సొంత ఇంటిగా భావించి, ప్రజల్ని తమ కుటుంబసభ్యులుగా భావించి, వారి సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలని అమలు చేస్తున్నారని వివరించారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతో సంక్షేమ పథకాల లబ్ధి నేరుగా ప్రజల ఖాతాల్లోనే జమ అవుతోందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్ని సచివాలయ కన్వీనర్లు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. అన్ని డివిజన్ల కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు కేటాయించిన బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించి, సీఎం ఆదేశాలను పాటించాలని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని చేరవేస్తూ, ఉత్సాహంగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, 23, 24వ డివిజన్ల కార్పొరేటర్లు సాదు ఉమా మహేశ్వరి, అడకా పద్మావతి, క్లస్టర్- 2 ఇంచార్జ్ సురసాని వెంకటరెడ్డి, 23వ డివిజన్ అధ్యక్షుడు యం.లూథర్‌బాబు, షేక్ నబిసా, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.